క్లుప్తంగా

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదిలాబాద్: పట్టణ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ద్వారక నగర్, కోలిపురా, చించర్ వాడ, 47వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో మరిన్ని పనుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పట్టణంలో రూ.320 కోట్లతో అండర్ డ్రైనేజీ, నీటిశుద్ధి తదితర పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రూ.11కోట్లతో పట్టణంలోని 16 వార్డుల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. వార్డుల్లో సమస్యలుంటే తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. నాయకులు లాలామున్న, ఆకుల ప్రవీణ్, జోగు రవి, సోమ రవి, రాజేశ్, శ్రీనివాస్, వేదవ్యాస్, శివ, గందె కృష్ణ, గందె విజయ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి'

నేరడిగొండ: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని స్థానిక సాయి చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కిరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాబాసాహెబ్ అంబేద్కర్, కుమురంభీం విగ్రహాలకు వినతిపత్రాలు ను అందజేశారు. అనంతరం తహసీల్దార్ ఎంఏ కలీమ్‌కు సైతం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఉసికేలా కార్తీక్, వైస్ ప్రిన్సిపాల్ శరత్, లెక్చరర్లు లింగన్న, ముకుంద్‌రావు, రాజశేఖర్, రవి, దినేష్, సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ఇచ్చోడ: ఆరోగ్యంపై గ్రామీణ ప్రాంత ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మాస్‌మీడియా అధికారి రవిశంకర్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పీహెచ్‌సీ పరిధిలో దాబా, గుండివాగు గ్రామాల్లో కళాజాత బృందాల ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా ఆరోగ్య బోధకులు వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉట్నూర్‌రూరల్: విధుల నిర్వహణలో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ జే.ఆర్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పులిమడుగు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో ఏవైనా లోపాలు ఉంటే అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. డీఈ సుభాశ్, ప్రభాకర్, ఏఈఈ పృథ్వీ, సబ్ ఇంజనీర్ శ్రావణ్, ఎల్ఐ లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

నేడు 2కే రన్

కైలాస్‌నగర్: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు పురస్కరించుకుని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 25న జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణశాఖ అధికారి శివపల్లి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.45గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ర్యాలీ కొనసాగుతుందన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నార్నూర్: మండలంలోని తాడేహత్నూర్ సబ్ సెంటర్ పరిధిలో ఉన్న 8 గ్రామాలకు చెందిన 29 మంది గర్భిణులకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండే గర్భిణీ మహిళల ఆరోగ్యంపై ఆశ, సబ్ సెంటర్ ఏఎన్ఎంలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సీహెచ్‌వో లక్ష్మి, హెచ్‌ఈవో తులసీదాస్ రాథోడ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, ఏఎన్ఎంలు సింధు, హెచ్‌ఏలు ఈశ్వర్ చౌహన్, గోకుల్ రాథోడ్, జవహర్ లాల్ తదితరులు ఉన్నారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన విజ్ఞేశ్వర్‌పై హత్యాయత్నం కేసు నమోదైనట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విజ్ఞేశ్వర్‌కు ఆయన సోదరునికి గురువారం గొడవ జరిగింది. గొడవలు ఎందుకు పడుతున్నారని మావల మండలంలోని కేఆర్కే కాలనీకి చెందిన కైలాస్ శుక్రవారం విజ్ఞేశ్వర్‌ను అడగ్గా ఆగ్రహించిన విజ్ఞేశ్వర్ కత్తితో హత్య చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో కైలాస్‌కు గాయాలయ్యాయి. కైలాస్ ఫిర్యాదు మేరకు విజ్ఞేశ్వర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన గ్రామసభలు


నేరడిగొండ: వడూర్‌లో..


నార్నూర్: మాట్లాడుతున్న ఎంఈవో పవార్ అనిత


తాంసి: మాట్లాడుతున్న తహసీల్దార్ నలందప్రియ


ఇచ్చోడ: అడేగామ కే గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి

- అర్హుల జాబితా చదివి వినిపించిన అధికారులు
- పేర్లు లేని వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచన

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు తదితర పథకాలకు అర్హుల ఎంపిక కోసం జిల్లాలో ఈ నెల 21నుంచి చేపట్టిన గ్రామసభలు శుక్రవారం ముగిశాయి. ఆయా పథకాలకు కుప్పలు, తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం 16,730, రేషన్‌కార్డుల కోసం 32,727, ఆత్మీయ భరోసాకు 13,666, రైతు భరోసాకు 387 చొప్పున అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామసభల్లో అర్హులను ప్రకటించిన అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో పడ్డారు. ఈ నెల 26నుంచి ఆయా పథకాలను అమలు చేయనున్నారు.

నేరడిగొండ: అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గారం, చిన్నబుగ్గారం, కొర్టికల్(కె), కొర్టికల్(బి), నాగమల్యాల్, పీచర, రోల్‌మామడ, వడూర్, యాపల్‌గూడ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి పేర్లను చదివి వినిపించారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. కాగా అక్కడక్కడ అర్హులైన వారి పేర్లు జాబితాలో లేవని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి సర్ది చెప్పి మళ్లీ దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, ఎంఈవో భూమారెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: అర్హులైన ప్రతీ ఒక్కరికి నాలుగు సంక్షేమ పథకాలను అందజేస్తామని జెడ్పీసీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం అడేగామ కే లో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు. హిరపూర్, మాన్కపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ ప్రత్యేకాధికారి సత్యానంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్‌లో

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26న అమలుకు శ్రీకారం చుట్టనున్న ఇందిరమ్మ గృహాలు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల అర్హుల జాబితా ప్రకటన కోసం నిర్వహించిన గ్రామసభలు శుక్రవారం ముగిశాయి. భూతాయి(బి) గ్రామ సభలో అర్హుల పేర్లు జాబితాలో లేవని ఎందుకు తొలగించారని మాజీ సర్పంచ్ ఫడ్ జ్ఞానేశ్వర్, మాజీ ఉపసర్పంచ్ సంతోష్ అధికారులను నిలదీశారు. చింతలసాంగ్వి, ధరంపురి, మాన్కపూర్ వర్తమన్నూర్, యేసాపూర్, దిగ్నూర్, మోర్కండిలో గ్రామసభలు సజావుగా జరిగాయి. కార్యక్రమంలో డీసీవో మోహన్, తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఎస్సై అప్పారావ్, ఏవో ఎండీ సాద్, ఏఈఓ చంద్రశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో..

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అర్హత ఉన్న నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని గట్టిపల్లి, దస్నాపూర్, పిట్టబొంగరం, తుమ్మగూడ, తెజాపూర్, డొంగర్‌గామ్, ఏమాయికుంట గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల జాబితాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం ఉట్నూర్, లక్కారం గ్రామపంచాయతీల్లో జరిగిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలపై సామాజిక మాధ్యమాలలో వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు.

నార్నూర్‌లో..

నార్నూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హులుగా ఉండి పేర్లు రాని వారు ఆందోళన చెందవద్దని మండల ప్రత్యేక అధికారిణి, ఎంఈవో పవార్ అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపల్లి, బలానపూర్, భేతాలగూడ గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాంసిలో..

తాంసి: ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు భీంపూర్ మండల తహసీల్దార్ నలందప్రియ అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని వడ్గాం గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ఎంపీవో సుమేర్ అహ్మద్, ఏఈవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి ఉన్నారు. లీమ్‌గూడ, అట్నంగూడ గ్రామాల్లో ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి అధ్యక్షతన ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో లింగయ్య, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, ఏఈవో నిఖిత సిబ్బంది ఉన్నారు.


ఉట్నూర్‌రూరల్: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


ఇంద్రవెల్లి: ఏమాయికుంట గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్


బజార్‌హత్నూర్: లబ్ధిదారుల జాబితా చదువుతున్న ఏఈ చంద్రశేఖర్


గుడిహత్నూర్: అధికారులతో వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్ నాయకులు


తలమడుగు: నిలదీస్తున్న నాయకులు


బోథ్: సొనాలలో నాయకుల మధ్య వాగ్వాదం

ప్రజాపాలన సభలో వాగ్వాదం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కొద్ది సేపు గందరగోళం నెలకొంది. సభ ప్రారంభంలో గిరిజన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఫొటోను ఎందుకు ఫ్లెక్సీలో ప్రచురించలేదని బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అక్కడికి రాగా గజేందర్‌కు ఇక్కడేం పని అంటూ? అధికారులతో వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరగ్గా ఎస్సై మహేందర్ ఇరువర్గాలను సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం ప్రజలు దరఖాస్తులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి సునీత, ఎంపీడీవో అబ్దుల్ మహ్మద్‌హై, పంచాయతీ కార్యదర్శి రాందాస్, వ్యవసాయశాఖ, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగులో..

తలమడుగు: ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేవని కొందరు గ్రామస్తులు గ్రామసభలో ఆందోళన చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి గజానంద్, ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. లబ్ధిదారుల జాబితా చదువుతుండగా అర్హులకు పథకాలు మంజూరు కాలేదని అధికారులను గ్రామస్తులు, అంబేద్కర్ సంఘం నాయకులు నిలదీశారు. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో ఎందుకు పెట్టలేదన్నారు. మండల ప్రత్యేకాధికారి గజానంద్ మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేనివారు గ్రామసభలో, మండల కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రామస్తులు రవీందర్, రవికాంత్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

బోథ్‌లో..

బోథ్: ప్రభుత్వ పథకాల అర్హుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం సొనాల, చింతలబోరి, మందబొగడ, కౌఠ బి, కంటెగాం, లంబాడితాండ, చింతగూడ, పట్నాపూర్ గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. సొనాల గ్రామసభలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. గ్రామసభల్లో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అతుల్ పాల్గొన్నారు.

డ్రైవర్లు భద్రత నియమాలు పాటించాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఆదిలాబాద్: డ్రైవర్లు రహదారి భద్రత నియమాలు పాటించాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. విద్యార్థులతో రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. డ్రైవర్లకు గులాబీలను అందించారు. అనంతరం డిప్యూటీ ఆర్ఎం మాట్లాడుతూ.. రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ దిశగా డ్రైవర్లకు అన్ని విధాలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రయాణికుల భద్రతే పరమావధిగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రైవర్లు ఒత్తిడికి గురి కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. వారి ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ పేరిట ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతోందని వివరించారు. టూ టౌన్ సీఐ కరుణాకర్, ట్రాఫిక్ అధికారి ప్రణయ్‌కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అశ్వంత్ కుమార్, డిపో మేనేజర్ శ్రీమతి కల్పన, ఎంఎఫ్ శ్రీకర్, స్టేషన్ మేనేజర్ పోశెట్టి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం


నేరడిగొండ: సన్మానిస్తున్న రమేశ్

నేరడిగొండ: మండలంలోని కుమారి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్ బాలికలను శాలువతో సన్మానించి మిఠాయిలు తినిపించారు.

కైలాస్‌నగర్: ఆడ పిల్లలను పుట్టనిద్దాం.. వారికి భద్రతనిద్దాం... స్వేచ్ఛ జీవితాన్ని అందిద్దామని సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

తలమడుగు: ప్రతీ ఆడపిల్ల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బరంపూర్ క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష అన్నారు. శుక్రవారం బరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత సెకండరీ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు.

ఆదిలాబాద్‌రూరల్: ప్రతి ఒక్క ఆడపిల్ల ఉన్నత చదువులు చదువుకుని ప్రయోజకులు కావాలని న్యూ రెయిన్ బో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొమ్ము రాము అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో భేటి బచావ్ భేటి పడావ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నేరడిగొండ: సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శిగ్గ సభ్యుడు అన్నమొల్ల కిరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం రాష్ట్ర నాల్గవ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బృందాకారత్, బీవీ రాఘవులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు రేసు సురేందర్, మండల నాయకులు లక్ష్మణ్, రాజశేఖర్ రెడ్డి, శ్రావణ్, నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, అది తన బాధ్యతని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వడూర్ గ్రామంలో రూ.51లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. షాదీఖానా నిర్మాణానికి రూ.5లక్షలు, ఖబరస్థాన్ ప్రహరీ, సీసీ నిర్మాణానికి రూ.5లక్షలు, సవారీ షెడ్ నిర్మాణానికి రూ.5లక్షలు, మహాలక్ష్మి ఆలయ షెడ్ నిర్మాణానికి రూ.3లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15లక్షలు, సాయిబాబా షెడ్ నిర్మాణానికి రూ.15లక్షలు, భవాని తండా గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3లక్షలు, అమృత్ తండాలో సీసీరోడ్లకు రూ.3లక్షలు, హైమాస్ లైట్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విడతల వారీగా పనులు చేపట్టి రానున్న రోజుల్లో అభివృద్ధి చేస్తామన్నారు. వడూర్ గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నేరడిగొండ, వడూర్ వీడీసీ చైర్మన్లు రవీందర్ రెడ్డి, గాదె సంతోష్, వడూర్ మాజీ ఎంపీటీసీలు ఉప్పు పోశెట్టి, అంబేకర్ పండరి, వడూర్ మాజీ ఉప సర్పంచ్ ఫయ్యాజ్, అనిల్ అన్న యువ సైన్యం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, జిల్లా నాయకులు శంకర్, భూషణ్, రాములు, శ్రీకాంత్, రవీందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దాబా కేలో పర్యటించి అంబేద్కర్ భవనం వద్ద రూ.3 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం జాదవ్ లక్ష్మణ్ స్మారక క్రికెట్ ముగింపు పోటీలలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బోథ్, నేరడిగొండ మండలాల మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, సజన్‌లాల్, నాయకులు పాండురంగ్, నర్వాడే రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని సుంకిడి గ్రామంలో నూతనంగా మంజురైన అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం భూమిపూజ చేశారు. మండలంలోని పాండగూడ గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పొంగుగూడ గ్రామం వరకు రూ.కోటి 20 లక్షలతో బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

'రైతు ఆత్మహత్యల పాపం బీఆర్ఎస్‌దే'

బోథ్: రైతు ఆత్మహత్యల పాపం బీఆర్ఎస్‌దేనని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ఆరోపించారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సొంత మండలంలోనే, ఆయన అధికారంలో ఉన్నప్పుడే ఎక్కువ రైతు ఆత్మహత్యలు జరిగాయన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆత్మహత్యల నివారణపై కమిటీ వేయడం శోచనీయమన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, రైతు నాయకుడు గడ్డలు నారాయణ, షేక్ అబుద్ పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

బోథ్: బోథ్ మండలం ధన్నూర్‌బి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సురేశ్ వైద్య పాఠశాలకు మైక్‌సెట్, సౌండ్‌సిస్టం శుక్రవారం విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రాజు చోప్డె, రావుల శంకర్, వీడీసీ సభ్యులు రాజేశ్వర్ రెడ్డి, గంగారాం ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బోథ్: పట్టణంలోని పాత సినిమా టాకీస్ ఆవరణలో గల పురాతన కొట్టాల పోచమ్మ ఆలయంలో విగ్రహావిష్కరణ ఈనెల 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం పండరి పంతులు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

బోథ్: మండల కేంద్రంలోని కొట్టాల పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి ఆహ్వానించారు.

'రాజ్యాంగ పీఠిక, అంబేడ్కర్ చిత్రపటం ఉంచాలి'

కైలాస్‌నగర్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞగా చదవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేశ్ మహరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోను కలిసి వినతిపత్రం అందజేశారు. జెండా వద్ద భారత రాజ్యాంగ పుస్తకాన్ని, అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

'ఆత్మీయ భరోసా' ఇవ్వాలి

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కేవలం ఉపాధిహామీ జాబ్‌కార్డ్ ఉన్న వారికే కాకుండా భూమిలేని ప్రతీ కుటుంబానికి అందించాలని బీఆర్ఎస్ నాయకులు భీంరావ్ పాటిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంతో మంది భూమిలేని నిరుపేదలు చిన్నా, చితక కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు.

'కుంభమేళా జలం ఎంతో పవిత్రం'

ఆదిలాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలోని గంగాజలం ఎంతో పవిత్రమైనదని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి అన్నారు. మఠంలో శుక్రవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కుంభమేళా జలం ఉచిత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, భక్తులకు జలాన్ని పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

బోథ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఫోరమ్ ఆఫ్ గ్లోబల్ యూత్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆదిలాబాద్ జిల్లా కౌఠ బి గ్రామానికి చెందిన యువకుడు వెండి సోమేశ్వర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బోథ్: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కళాశాల ప్రిన్సిపాల్ విఠల్ ఆవిష్కరించారు. తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా జాయింట్ సెక్రెటరీ చింతల రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు జయరాజ్, ఉదయ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'మహాసభలు విజయవంతం చేయండి'

బోథ్: కోరుట్లలో ఈ నెల 30, 31వ తేదీల్లో జరిగే బీడీ కార్మికుల ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం మహాసభలను విజయవంతం చేయాలని బీడీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ పిలుపునిచ్చారు. శుక్రవారం బీడీ కార్మికులు, బీడీ ప్యాకర్స్‌తో కలిసి సభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులపై అవలంభిస్తున్న విధానాలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.